పేదల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేదల సంక్షేమం కోసం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనను మళ్లీ సిఎం చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. సోమవారం స్థానిక ముస్లిం యువతతో కలిసి ఆయన కడపలోని అమీన్‌పీర్ పెద్ద దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద వర్గాల సంక్షేమం కోసం పరితపిస్తూ, సామాజిక న్యాయం దిశగా సుపరిపాలనను సిఎం జగన్ అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్న వైసిపి ప్రభుత్వం గురించి టిడిపి, జనసేన చేస్తున్న దుష్ప్రచారం తగదన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఆలోచనలు, ఆశయాల మేరకు పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, రైతులు, పేద వర్గాల ప్రజలు వెంటే నడుస్తారని తెలిపారు. కుహనా రాజకీయ పార్టీలు, నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మైనార్టీ యువ నాయకులు అలీ ఆన్సర్, సమీ, అజ్మత్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే

ప్రభుత్వ పతనం తప్పదు

- అంగన్వాడీలపై నిర్బంధాన్ని నిరసిస్తూ అఖిలపక్షాల రాస్తారోకో

మదనపల్లె : రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగన్‌వాడీల సమస్యలు వింటారో లేదో సిఎం తేల్చుకోవాలని, వారి పోరాటం న్యాయ సమ్మతమైందని, ఇప్పటికైనా పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని ఉంచాలో లేదో అంగన్‌వాడీలే తేలుస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు హెచ్చరించారు. జగనన్నకు చెబుదామని విజయవాడ బయలుదేరిన అంగన్‌వాడీల అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళా శక్తికి మించింది మరొకటి లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా వారిని నిరాహార దీక్ష చేసే వరకూ తీసుకెళ్లిన సిఎం అంగన్‌వాడీల సమస్యలు విని పరిష్కరిస్తారో లేదో తేల్చుకోవాలన్నారు. వారితో పెట్టుకున్న ప్రభుత్వాలేవీ ఇంతవరకు నిలబడిన దాఖలాలు లేవని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో డిసిపి విశాల్ గున్ని నాయకత్వంలో వందలాది మంది పోలీసులు విజయవాడ ధర్నా చౌక్‌లో టెంట్‌ను పీకేసి, కరెంట్ తీసేసి దీక్షలో ఉన్న వారి పట్ల కనికరం కూడా చూపకుండా, మహిళలని కూడా చూడకుండా అమానుషంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మగ పోలీసులే మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం చట్ట విరుద్ధమని ఆగ్రహించారు. సిపిఐ నాయకులు కృష్ణప్ప మాట్లాడుతూ సమస్యను పరిష్కరించడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ మాట్లాడుతూ మహిళలంటే చులకనగా చూస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న అంగన్వాడీ నాయకులతో పాటు వేలాది అంగన్వాడీ ఉద్యోగులను అర్ధరాత్రి అమానుషంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రరెడ్డి మాట్లాడుతూ సమస్యను సామరస్య పూర్వకంగా చర్చించి పరిష్కరించకుండా అంగన్వాడీ మహిళా ఉద్యమాన్ని అమానుషంగా అణచివేయడం దారుణమని ధ్వజమెత్తారు. తక్షణం వారిని విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వ అమనుషానికి వ్యతిరేకంగా ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రఘునాథ్, సిపిఐ నాయకులు దేవా, ఎఐటియుసి నాయకులు తిరుమల, మస్తాన్, సిఐటియు నాయకులు జయరాం, రమణ, కాంగ్రెస్ నాయకులు పవన్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలపై ఎస్మా చట్టం తేవడం, విజయవాడలో అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని ఎఐటియుసి తంబళ్లపల్లి నియోజకవర్గం అధ్యక్షులు ఎస్.సలీం బాషా, కార్యదర్శి బి.వేణు గోపాల్‌రెడ్డి, జి.రఘునాథ్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల అరెస్టుకు నిరసనగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార దాహంతో అధికారంలోకి వచ్చాక తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి వేతనం పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలను రోడ్లపాలు చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల కార్యదర్శి జి.రఘునాథ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాలకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.అష్రఫ్ అలీ, నాయకులు గంగులప్పా, బాబు, రియాజ్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాజ్యాంగ బద్ధంగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే సమ్మెను అణిచివేస్తూ వారిపై నిర్బంధాలను విధిస్తూ రాజ్యాంగ విలువలు తెలియని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని 42 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు రాజ్యాంగ బద్ధంగా చీఫ్ సెక్రటరీ నుంచి కింద ఉన్న ఐసిడిఎస్ సిడిపిఒలకు, సూపర్వైజర్లకు సమ్మె నోటీసు అందించి సమ్మె చేస్తుంటే వారి న్యాయమైన సమస్యలు తీర్చకుండా చేస్తున్నటువంటి సమ్మెను భయాందోళనలతో, బెదిరింపులతో విచ్ఛిన్నం చేయాలని చూడడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఉద్యోగాల నుంచి తీసివేస్తానని బెదిరించడం సరికాదని తెలిపాఉ. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ, సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, నాయకులు నాగేశ్వరావు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : బిఎస్‌పి

పుల్లంపేట : అంగనవాడీ కార్మికులు వేతనాలు పెంచమంటే విజయవాడలో అర్ధరాత్రి అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రైల్వేకోడూరు బహుజన సమాజ్వాది పార్టీ ఇన్‌ఛార్జి సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లో నిర్బందిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే మరింత జటిలం చేసేలా ప్రభుత్వ వైఖరి ఉందని వెంటనే వాళ్ళ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి అంగన్వాడీలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. ప్రభుత్వం కళ్ళు తెరచి అంగన్వాడీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బి.కొత్తకోట : నిరసన తెలుపుతున్న నాయకులు

రాజంపేట : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వామపక్ష నాయకులు

మహిళలదే పైచేయి

- 13 అసెంబ్లీల్లోనూ ప్రథమ స్థానం
- కడప జిల్లాలో 8,25,177, అన్నమయ్యలో 7,13,326 మంది మహిళా ఓటర్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా విడు దలైంది. ఆయా జిల్లాల రెవెన్యూ అధికార యంత్రాంగాలు కడప జిల్లాలోని ఏడు, అన్నమయ్య జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సుదీర్ఘ పరిశీలన, వడపోతల అనంతరం సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేసింది. కడప జిల్లాలో 16,16,509 మంది, అన్నమయ్య జిల్లాలో 14,02,808 మంది ఓటర్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కడప జిల్లాలో 8,25,177 మంది, అన్నమయ్య జిల్లాలో 7,13,326 మంది మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నట్లు తేలింది. కడప జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం. కడప జిల్లాలో కడప అసెంబ్లీ పరిధిలో 2,74,226 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 13,3,890 మంది పురుషులు, 14,0248 మంది స్త్రీలు, 88 మంది ట్రాన్స్‌జెండర్స్ 77 మంది పురుషులు, తొమ్మిది మంది పురుష, స్త్రీ సర్వీసు ఓటర్లు ఉన్నారు. బద్వేల్ రిజర్వ్‌డ్ నియో జకవర్గంలో 2,17,769 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,08, 673 మంది పురుషులు, 1,09,089 మంది స్త్రీలు, ఏడు గురు ట్రాన్స్‌జెండర్స్, 945 మంది, 26 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. పులివెందు అసెంబ్లీ పరిధిలోని 2,27,453 మంది ఓటర్లలో 1,10,829 మంది పురుషులు, స్త్రీలు 1,16,605 మంది, 19 మంది ట్రాన్స్‌జెండర్స్, 398 మంది పురుష సర్వీస్, ఐదుగురు స్త్రీ సర్వీసు ఓటర్లు ఉన్నారు. కమ లాపురం అసెంబ్లీ పరిధిలోని 2,00, 222 మంది ఓటర్లలో 98,037 మంది పురుషులు, స్త్రీలు 1,02, 151 మంది స్త్రీలు, 34 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. జమ్మల మడుగు అసెంబ్లీ పరిధిలోని 2,40, 835 మంది ఓటర్లలో 1,17,067 మంది పురుషులు, స్త్రీలు 1,23,751 మంది, ట్రాన్స్‌జెండర్స్ 17 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు పురుషులు 262 మంది, స్త్రీలు ఆరుగురు ఉన్నారు. ప్రొద్దు టూరు అసెంబ్లీ పరిధిలో 2,46,726 మంది ఓటర్లలో పురుషులు 1,19,680 మంది,1,26,995 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్స్ 141 మంది ఉన్నారు. మైదుకూరు అసెంబ్లీ పరిధిలోని 1,02,932 మంది, స్త్రీలు 1,06,338 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఎనిమిది మంది, సర్వీసు ఓటర్లు 267 మంది, స్త్రీలు 10 మంది చొప్పున నమోదు చేసుకోవడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో రాజంపేట అసెంబ్లీ పరిధిలో 2,37,028 మంది ఓటర్లలో 1,15,594 మంది పురుషులు, 1,21,424 మంది స్త్రీలు, 10 మంది ట్రాన్స్‌జెండర్స్, సర్వీసు ఓటర్లలో పురుషులు 158 మంది, స్త్రీలు 05 మంది ఉన్నారు. రైల్వేకోడూరు రిజర్వ్ నియోజకవర్గంలో 2,01,544 మంది ఓటర్లలో పురుషులు 99,351 మంది, స్త్రీలు 1,02,176 మంది, 17 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉండగా, సర్వీసు ఓటర్లలో 112 మంది పురు షులు, 04 ఉన్నారు. రాయచోటి అసెంబ్లీ పరిధిలో 2,50,374 మంది ఓటర్లలో 1,23,836 మంది పురుషులు, 1,26,512 మంది స్త్రీలు, 26 మంది ట్రాన్స్‌జెండర్స్, సర్వీసు ఓటర్లలో పురుషులు 253 మంది, స్త్రీలు 01 ఉన్నారు. తంబళ్లపల్లి అసెంబ్లీ పరిధిలోని 2,21,647 మంది ఓటర్లలో పురు షులు 1,09, 219 మంది, స్త్రీలు 1,12,418 మంది, 10 మంది ట్రాన్స్‌జెండర్లు, సర్వీసు ఓటర్లలో పురుషులు 175, స్త్రీలు 01 ఉన్నారు. పీలేరు అసెంబ్లీ పరిధిలో 2,32,435 మంది ఓటర్లలో పురుషులు 1,14,022 మంది, స్త్రీలు 1,32,399 మంది, ట్రాన్స్‌జెండర్లు 16 మంది, సర్వీసు ఓటర్లలో పురుషులు 396 మంది, స్త్రీలు 06 మంది ఉన్నారు. మదనపల్లి అసెంబ్లీ పరిధిలో 2,59,780 మంది ఓటర్లలో పురుషులు 1,27,324 మంది, స్త్రీలు 1,32,399 మంది, ట్రాన్స్‌జెండర్లు 57 మంది ఉన్నారు. ఇందులో సర్వీసు ఓటర్లు పురు షులు 168, స్త్రీలు 07 మంది ఉన్నారు. ఏదేమైనా కడప, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 26న నిర్వహించే 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలని చెప్పారు. ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్‌డిఒ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. జాతీయ జెండా ఎగరవేయుట, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల జారీ, ప్రొటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ ఇవ్వాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రాజకమల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో పూర్తిగా సమన్వయం చేసుకొని పరేడ్ మైదానంలో పోలీస్ శాఖ తరఫున చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి వేడుకల విజయవంతానికి కృషి చేస్తామన్నారు. అధికారులందరూ ఒకరోజు ముందుగా పెరేడ్ మైదానాన్ని సందర్శించి చేయవలసిన ఏర్పాట్లపై తగు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

బాధితులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జెసితోపాటు డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తిచెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు లేకుండా వాహనాలు నడపరాదని ఎంవిఐ వినోద్ కుమార్, రూరల్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి పి.దినేష్ చంద్ర ఆదేశాల మేరకు రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా సోమవారం వారు వైజంక్షన్ వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాహనదారులకు పలు సూచనలు చేశారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు స్టిక్కర్లు అంటించి రోడ్డు భద్రతా నియమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంవిఐ కార్యాలయ సిబ్బంది, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు రేడియం స్టిక్కర్ అతికిస్తున్న రవాణా శాఖ అధికారులు

డాక్టర్ శివజ్యోతికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో నిర్వహించిన 6వ అంతర్జాతీయ అగ్రికల్చర్ సదస్సులో ఎర్రగుంట్లకు చెందిన సీనియర్ రిపోర్టర్ శిరిగిరెడ్డి సదాశివరెడ్డి కుమార్తె డాక్టర్ శిరిగిరెడ్డి శివజ్యోతికి యంగ్ సైంటిస్ట్ అవార్డు దక్కింది. ఆమె గోపవరంలోని పశువైద్య కళాశాలలో పరాన్న జీవశాస్త్ర విభా గంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పశువులలో వచ్చే ‘ మెదడుకు సంబంధించిన జబ్బులు-రక్త పరాన్న జీవులు’ అనే అంశంపై చేసిన పరిశోధనలుకుగానూ ఎన్‌ఆర్‌ఆర్ఐ సంస్థ యంగ్ సైంటిస్ట్ అవా ర్డును అందించింది. ఈ సదస్సులో సుమారు 300 మంది వివిధ దేశాల సైంటిస్టులు పాల్గొన్నారు. ఐసిఎఆర్, ఎన్‌ఆర్‌ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎకె నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శివజ్యోతి మాట్లాడుతూ గేదెలలో రక్త పరాన్న జీవుల వల్ల కొత్త లక్షణాలు వస్తున్నాయని, వాటిని త్వరితగతిన గుర్తిస్తే జబ్బుకు తగిన చికిత్స సుల భతరమని వివరించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి సీనియర్ రిపోర్టర్ సదాశివారెడ్డి మాట్లాడుతూ అవార్డు దక్కడంతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎన్నో అవార్డులు వచ్చాయని, కానీ యంగ్ సైంటిస్ట్ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. ఇంతటి అవార్డు దక్కించుకున్న అమ్మాయి ఎర్రగుంట్ల వాసి కావడం గర్వకారణంగా ఉందని స్థానిక ప్రముఖులు పలువురు ప్రశంసించారు.

ఆస్పత్రులపై దాడుల వల్ల మనకే నష్టం : సిఐ

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

వైద్యులు, ఆసుపత్రులపై దాడుల వల్ల మనకే నష్టమని, ఫలితంగా కష్టాలను ఎదుర్కొనేది కూడా మనమే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రుల్లో రోగులకు లభించే సేవలు, వివిధ దశల్లో ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారికి అందించే చికిత్సపై ఐఎంఎ పీలేరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు చాలామంది తాము ఆశించినంతగా తమ వారు కోలుకోవడం లేదన్న టెన్షన్, అవగాహనా లోపంతో వైద్యులపై దాడులు చేయడం అసాంఘిక చర్యలని పేర్కొన్నారు. వైద్యులపై దాడులకు పాల్పడే వారిపై నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. ఐఎంఎ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎవరిపై వైద్యులకు పగలు, కక్షలు ఉండవన్నారు. వేర్వేరు మనుషులకు వేర్వేరుగా ఉండే శరీర ధర్మాలను బట్టి మందులు ప్రభావం చూపుతాయని తెలిపారు. కొందరిపై త్వరగా ప్రభావం చూపితే మరికొందరిపై ఆలస్యంగా ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. అటువంటి సందర్భాల్లో చికిత్స అందించే వైద్యుడిపై ఒత్తిడి చేయడం, దాడులకు పాల్పడడం చేస్తే రోగికే నష్టం కలిగి పాణాపాయం ఏర్పడే పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉండే చులకన భావాన్ని తొలగించుకోవాలని చెప్పారు. ప్రయివేటు ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పరిమిత వనరులతో ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించే ప్రభుత్వ వైద్యులను చులకనగా మాట్లాడడం మానుకోవాలన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ రాజాసాహెబ్ మాట్లాడుతూ తమ చేతుల్లో లేని అంశాల కారణంగా వైద్యులు అనేక సందరాల్లో నిస్సహాయులుగా మిగిలిపోతుంటారని తెలిపారు. ఆ సమయాల్లోనే ఆయా వైద్యుల నిబద్ధతపై అనుమానాలు వ్యక్తం చేస్తుంటారని తెలిపారు. వైద్యులు దేవుళ్ళ కారన్న సంగతి గ్రహించి, తమకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సిఐ మోహన్‌రెడ్డిని వైద్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఎ ఉపాధ్యక్షులు డాక్టర్ రూపేష్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్, సహాయ కార్యదర్శి డాక్టర్ శశి భూషణ్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఈశ్వర సురేంద్ర, సభ్యులు డాక్టర్ శ్రీనివాస గుప్తా, డాక్టర్ మమతా లక్ష్మి, డాక్టర్ మాధవీ రెడ్డి, డాక్టర్ నాగవేణి, డాక్టర్ శ్వేత రాణి, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ దినేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదానికి ముందే జాగ్రత్త అవసరం : ఎంవిఐ

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న ఎంవిఐ విజయకుమారి

వాహనాల ప్రమాదం జరిగిన తర్వాత జాగ్రత్త పడడం కాదని, అవి జరగక ముందే తగిన అప్రమత్తత చాలా అవసరమని పీలేరు మోటర్ వాహనాల తనిఖీ అధికారిణి టి.విజయకుమారి, విఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, యోగా థెరపిస్ట్ డాక్టర్ పివిఎస్ లక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఎంవిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణాశాఖ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల 3వ రోజు కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనాలు నడిపే సమయంలో తమపై ఆధారపడి ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలని, తేలిక, భారీ వాహన దారులు సీట్ బెల్ట్ విధిగా పెట్టుకుని, భద్రంగా గమ్యం చేరాలని హితవో పలికారు. హెల్మెట్ వాడకుంటే సెక్షన్ 177 ప్రకారం రూ.1000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రహదారి భద్రతలను గుర్తు చేసి వాహనదారుల జీవితాలకు భద్రత కల్పించడం కోసం ప్రతి సంవత్సరం 20 జనవరి మొదలు 19 ఫిబ్రవరి వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఆచరించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వారు రోడ్డు భద్రతా ప్రచార సామగ్రి, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షీ సంస్థ లీగల్ అడ్వైజర్ డాక్టర్ రాయల సుధాకర్ రాయలు, శాస్త్రీయ నృత్య కళాకారిణి పాలగిరి హరిత నగేష్, ఆర్‌ఎంపీ వైద్యురాలు సునీత, పలువురు వాహనదారులు, ఎంవిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల తుది జాబితా

- రాజకీయ పార్టీల సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం జిల్లాలో 14,02,808 మంది ఓటర్లతో నేడు తుది జాబితాను ప్రచురించామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియలో భాగంగా మొత్తం 14,02,808 మందితో పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా రూపొందించామని పేర్కొన్నారు. పురుష ఓటర్లు 6,89,346 మంది, మహిళా ఓటర్లు 7,13,326 మంది, థర్డ్ జెండర్ 136 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు సర్వీస్ ఓటర్లు 1287 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 1263, స్త్రీలు 24 మంది ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం తుది జాబితాను చాలా పారదర్శకంగా ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించడం జరిగింది. ఈ తుది జాబితాను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయములలో, పోలింగ్ కేంద్రంలో ప్రచురించడమైనదని పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాను తనిఖీ చేసి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 7, 8లలో, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6లో దరఖాస్తు సమర్పించవచ్చునని రాజకీయ పార్టీలకు జేసి తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జెసిబితో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

వారంలోపు కల్వర్టు పనులు పూర్తి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని రాయచోటి ప్రధాన రహదారిలో గేటు వద్ద ఉర్దూ పాఠశాల సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు పనులను వారంలోపు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి ఎఇ యూసఫ్ పేర్కొన్నారు. సోమవారం జెసిబి యంత్రాన్ని ఉపయోగించి పని ప్రారంభించినట్లు తెలిపారు. మండల పరిధిలోని కొలంపేట కొత్త రోడ్డు రెన్యూవల్‌కు రూ.1.20 కోట్లు, గాలివీడు-రాయచోటి రోడ్డుకు రూ.1.40కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మూడున్నర కిలోమీటర్ల వరకు ఉన్న బిట్స్‌లో అక్కడక్కడ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు 'జయహో బిసి' సమావేశం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన రామాపురంలోని శ్రీగౌతమ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మంగళవారం జయహో తెలుగుదేశం పార్టీ బిసి సమావేశం నిర్వహిస్తున్నట్లు రామాపురం క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణగౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి టిడిపి కుటుంబ సభ్యులు వీర మహిళలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కలకడ ఎస్ఐగా రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కలకడ

బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణారెడ్డి

కలకడ ఎస్ఐగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.మండల కేంద్రమైన కలకడ సర్కిల్ పరిధిలో ఉన్న కలకడ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా రామకృష్మిష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి విఆర్‌కు బదిలీ కావడంతో ఆస్థానంలో గతంలో సుండు పల్లెలో ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిని కడప ఎస్ఐగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తామని అన్నారు. క్రికెట్ బెట్టింగ్, గుట్కా, మట్కా, చోరీలు, పేకాట, నాటుసారా తయారీ, విక్రయాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు.

నేడు పుల్లంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రఘురాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని మండలానికి సంబంధించిన అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని, మండలానికి సంబంధించి వాళ్ళ సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అధికారులంతా తమ శాఖపై పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆడదాం ఆంధ్ర ఆటల పోటీల నిర్వహణపై టిడిలు, పిఇటిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 29వ వరకు నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో టిడిలు మొగల్ ఖాదర్‌బాషా, మొహనిద్దున్, ఈశ్వరమ్మ, పిఇటిలు లత,రాజు, చలపతి రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

సుండుపల్లి : పేదలకు వస్త్రాదానం, అన్నదానం చేయడం చాలా సంతోషాన్ని ఇస్తుందని మల్లు శివారెడ్డి పేర్కొన్నారు. ప్రతి శనివారం ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదాన చేస్తామని తెలిపారు. పేద ప్రజలకు అన్నదానం చేయడం గొప్ప భాగ్యమన్నారు.

'సుగవాసి'కి సన్మానం

పెద్దమండ్యం : మండల టిడిపి నాయకులు, కార్యకర్తల ఆహ్వానం మేరకు పెద్దమండెం వచ్చిన టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిసుగవాసి బాల సుబ్రహ్మణ్యం మైనార్టీనాయకులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలుకు దిశా నిర్దేశం చేసారు. కార్యక్రమంలో సి. గొల్లపల్లి మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, సోంశేఖర్ రెడ్డి, చలపతి నాయుడు, సురేష్, శ్రీనివాసులు నాయుడు, హసీమ్ సాహెబ్, పూలశెట్టి సుబ్బయ్య, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

గత నెల 26 నుంచి ఈనెల 12 వరకు నిర్వహించిన సమ్మెకు సంబంధించి ప్రభుత్వ పెద్దలకు, కార్మిక సంఘ నాయకులకు నిర్వహించిన చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నగర పాలక సంస్థ నుంచి కార్మికుల తరపున కమిషనర్ ప్రభుత్వానికి నివేదిక పంపాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు సుంకర రవి కోరారు. సోమవారం కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్రను వినతిపత్రం అందజేశారు. డిమాండ్ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి.వి.సుబ్బయ్య, ఓబులేసు, కంచుపాటి తిరుపాల్, ఇత్తడి ప్రకాష్, వడ్లపల్లి శ్రీధర్ బాబు,నాగరాజు, కొండయ్య, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ

కడప : లక్నోలోని ధ్యాన్‌చంద్ ఆస్ట్రో స్టేడియంలో ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహించబోయే 34వ ఆలిండియా కె.డి. సింగ్ బాబు సబ్ జూని యర్ అండర్ -14 బాలుర హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు కడప ధ్యాన్ చంద్ అకాడమి డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా సోమవారం పంపిణీ చేశారు. ముందుగా టోర్నమెంట్‌లో పాల్గొనే 16 మందిని ఎంపిక చేసి పేర్లను ప్రకటించారు. ఎంపికైన వారిలో సాయిమోహన్, కె.మస్తాన్‌బాషా, టి.సురేష్, ఏ.మహిధర్, వి.హర్షవర్ధన్ రెడ్డి, వి.జగన్మోహన్ రెడ్డి, సి. పార్థివర్మ, ఎస్. అజయ్ కుమార్‌రెడ్డి, ఎస్.అబూబకర్ సిద్దిక్, పి.వెంకటసందీప్‌రెడ్డి, కె.జస్వంత్, కే.కిషోర్, కె.నాగతరుణ్, కె. సాయిచరణ్, ఎస్. అలీమురాద్‌బాషా కె.కీర్తన్ కాంత్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు కీర్తి. కమలాకర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులతో సుభాన్‌బాషా

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు : జడ్జి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఫైజున్నీసా

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఫైజున్నీసా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం అన్ని సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుక రావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో చదివే విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని కష్టపడి చదివి మంచి అభివృద్ధి లోకి రావాలని ఆకాంక్షించారు. మహిళా చట్టాలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. తల్లిదండ్రులు అమ్మాయిలకు చిన్నవయసులో వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 22 ఏళ్లు పూర్తయిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర ఉన్నందున కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించాలని పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, న్యాయవాది సిద్దయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌దే : 'కస్తూరి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

వైసిపి ప్రభుత్వం గత పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీల వివిధ రకాల పేరుతో పెంచి ప్రజలను నట్టేట ముంచాడని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014 సంవత్సరంలో రాష్ట్రం విడిపోయి లోటు బడ్జెట్‌లో ఉన్నా ఐదు సంవత్సరాల టిడిపి ప్రభుత్వ హయాంలో ఒక్క సారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ప్రజావేదికను కూల్చివేతతో మొదలుపెట్టి బడుగు బలహీన వర్గాలను టార్గెట్ చేసి అణగదొక్కిందని అన్నారు. నా ఎస్‌సిలు, నా బిసిలు, నా మైనార్టీలని ఊరువాడ తిరిగి ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చాక ఎస్‌సిలపై దాడులు బిసిలపై దాడులు మైనారిటీల పైన దాడులు చేశారని అన్నారు. వివిధ రకాల టాక్స్‌ల రూపంలో ప్రజల రక్తం పిండుతూ చెత్తపై పన్ను వేసిన చేతగాని చెత్త ముఖ్య మంత్రి అని విమర్శించారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ఈ ఐదు కోట్ల ఆంధ్రులకు ఏం చేసి ఉద్ధరిస్తాడని ప్రశ్నిస్తున్నానన్నారు. మన రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, మన పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా, ఉపాధి ఉద్యోగాలు రావాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా చంద్రబా బును ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడితే తప్ప మరొక మార్గం లేదని అన్నారు. సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయు డు, మాజీ ఎంపిటిసి ఫణీంద్ర, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్నూరు శివ, రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నాగినేని సురేష్, బూత్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు ఆచారి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఎరువు దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని ఎరువు దుకాణాల్లో వ్యవ సాయశాఖ మదనపల్లి భూసంరక్షణ విభాగం వ్యవసాయ అధికారి ఎం.కృష్ణ వేణి, స్థానిక వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలసి సోమ వారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లిలోని ఎరువు దుకాణాలను, వ్యవసాయ పంటల పిచికారి మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎరు వులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని అన్నారు. రైతులకు విక్రయిం చిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువు నిల్వలు, నాణ్యత, విక్రయాల రిజిస్టర్లను పరిశీలించినట్లు తెలిపారు. దుకా ణాల్లో తూనికలు, కొలతలను పరిశీలించామని తెలిపారు. వ్యవసాయ పంటల పిచికారి మందులను నమూనాల కోసం సేకరించా మన్నారు. దుకాణాల లైసెన్సులను, రసీదులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సూచించారు. ఎరువుల విక్రయ రశీదులను సక్రమంగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిన గిరిజనులు

గిరిజనులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వనాథనాయుడు

ప్రజాశక్తి-చిట్వేలు

మండల పరిధిలోని సి.కందులవారిపల్లి పంచాయతీలోని తుమ్మచెట్లపల్లి గ్రామంలో సోమవారం 'బాబు షఉరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గిరిజన దళిత కుటుంబాలు రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచిన విశ్వేశ్వరనాయుడు, టిడిపి మండలాధ్యక్షుడు కెె.చౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను గమనించి టిడిపిలో చేరామని తెలిపారు. టిడిపి హయాంలోనే గిరిజనులు మేలు జరుగుతుందని నమ్ముతున్నామని, టిడిపిలో చేరడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలు తమ గ్రామంలో సిమెంట్ రోడ్డు కావాలని సభ దృష్టి తీసుకరావడంతో విశ్వనాథ నాయుడు వెంటనే స్పందించి టిడిపి అధి కారం లోకి వచ్చిన వెంటనే మొట్టమొదటిగా గిరిజనులకు అన్ని రకాల సౌక ర్యాల తో పాటు సిసి రోడ్లు నిర్మిస్తామని హామీనిచ్చారు. అనంతరం ఇంటిం టికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. టిడిపి అధ్యక్షులు రూపొందించిన మినీ మెనిఫెస్టోలోని ఆరు పథకాలపై వివరించడం, వాటిపై సంతకం చేసి హామీ పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తుంగ పిచ్చయ్య నాయుడు, చరణ్, కోటేశ్వర్ నాయుడు, వెంకట నాగులు, బొప్పాయి శ్రీనివాస నాయుడు, వెంకటే శ్వర రాజు, బాలకృష్ణ యాదవ్, గుండయ్య యాదవ్, లాయర్ బాలాజీ, ఏదోటి రాజశేఖర్, లోకేష్‌నాయుడు, పుటిక సుబ్బరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపిని ఆదరించండి : 'దాసిరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి నాయకులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని సంక్షేమ పాలన కోసం టిడిపిని ఆదరించాలని నియోజకవర్గ టిడిపి నాయకులు దాసిరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని జుంజురపెంట పంచాయతీ బురుజుపల్లిలో నూతన రామాలయ నిర్మాణానికి జయ చంద్రారెడ్డితో పాటు రాజంపేట టిడిపి పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి సుబ్రహ్మణ్యం, జనసేన తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి సాయినాథ్‌లు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల కడలి నుంచి బయట పడాలంటే టిడిపి, జనసేన పార్టీలు అధికారంలోకి రాక తప్పదన్నారు. ఆర్ఎన్ తాండ పంచాయితీ ఎద్దుల వారి కోటలో స్థానిక ప్రజలు, మహిళలు మంగళ హారతులు, ప్రత్యేక వాయిద్యాలతో ఇరువురు నాయకులకు ఘన స్వాగతం పలికారు. టిడిపిని ఆదరించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా జయచంద్రారెడ్డి, ఎంపీగా సుగవాసి సుబ్రహ్మణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామని స్థానిక నాయకులు, కార్యకర్తలు తెలిపారు. బురుజుపల్లి రామాలయం, ఎద్దుల వారి కోట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి దాసిరపల్లి జయ చంద్రారెడ్డి, సుగవాసి సుబ్రహ్మణ్యం లు ఆర్థిక సాయం అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సిద్ధమల్ రెడ్డి, కొండారెడ్డి, మాధవ రెడ్డి, రాజారెడ్డి, చల్లపల్లి వేణుగోపాల్ రెడ్డి, మార్క్రిరి ఆంజనేయ రెడ్డి, మంత్రి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌బాబు

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దమండెం రహదారిలోని బోడిరెడ్డిగారిపల్లి కూడలి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సైబర్ నేరాలపై అధికమవుతున్నాయని అన్నారు. నంబర్ లేకుండా వచ్చే సెల్‌ఫోన్ కాల్స్‌ను ఎత్తకూడదని, ఎవరైనా ఒటిపి మెసేజ్‌లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోన్‌యాప్స్‌పై అవగాహన కలిగి ఉండాలని చాలా మంది లోన్‌యాప్స్ మాయలో పడి ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని అన్నారు. వాహనదారుడు వాహనాలు నడిపే సమయంలో తమపై ఆధారపడి ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలని, తేలిక, భారీ వాహన దారులు సీట్ బెల్ట్ విధిగా పెట్టుకుని, భద్రంగా గమ్యం చేరాలని హితవో పలికారు. గ్రామాలలో అనుమానాస్పద స్థితిలో ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పశు వ్యాధుల పట్ల రైతులకు అవగాహన : జెడి

ప్రజాశక్తి-రామాపురం

రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున గుణశేఖర్ పిల్లై

మండలంలోని రాచపల్లి పంచాయతీ లోని రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు పశువుల వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిల్లైనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లి పంచాయతీలోని గంగనేరు పొలిమేరపల్లె గ్రామాలలో ఆయన పర్యటించారు. గత కొన్ని రోజులుగా మృతి చెందుతున్న ఆవుల వ్యాధి నివారణ చర్యలు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి పశువుల యజమానులకు వివరించారు. మంగళవారం ఆ గ్రామంలో పశువైద్య బృందం ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో గ్రామంలో ఉన్న ప్రతి పశువుకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ రెడి పాల్గొన్నారు.

అర్చకుడికి చెక్కును అందిస్తున్న వరలక్ష్మీ

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలోని పెద్ద ఓరంపాడు పంచాయతీకి చెందిన శ్రీ గౌరీసిద్దేశ్వరస్వామి ఆలయ అర్చకులు కణితి హరిబాబు కుమార్తె అర్చన వివాహానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కారూపానందరెడ్డి భార్య ముక్కా వరలక్ష్మీ రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయనహరిబాబు మాట్లాడుతూ ముక్కా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని, కష్టాల్లో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తూ ఆదుకుంటున్నారని అన్నారు. తన కుమార్తె వివాహానికి వారు అందించిన ఆర్థిక సాయం ఎంతో దోహదపడిందని అన్నారు. వారు చేసిన సాయం మరువలేమని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందిస్తున్న సత్తాజ్ హుస్సేన్

హిందీ భాషతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం హైదరాబాద్ హిందీ ప్రచార సభ ప్రథమ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రమాణ పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి. రమణమూర్తి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షల నిర్వాహకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు హిందీ పరీక్షలు రాయించడం అభినందనీయమన్నారు. వివిధ హిందీ కోర్సుల వలన భవిష్యత్తులో విద్యార్థులకు అధ్యాపక, బ్యాంకింగ్, రైల్వే రంగాలలో ఉద్యోగవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. హిందీభాషాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు రమణమూర్తి, విశ్వనాథ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. పోటీ పరీక్షల్లో పాల్గొన్నప్పుడే విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యం బయటకు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో టి.కమ్మపల్లె ఉపాధ్యాయులు బాల నరసింహులు పాల్గొన్నారు.

భజన మండలి భవనానికి భూమిపూజ

వీరబల్లి : మండలంలోని షికారుపాలెంలో గంగమ్మఆలయం, నాయినివారి పల్లెలో రామాలయం, భజన మండలి భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పిచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలు త్వరితగతిన నిర్మాణాలు చేసుకోవాలన్నారు. దేవదయ శాఖ ఆధ్వర్యంలో రావాల్సిన నిధులను తప్పక ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాంగౌడ్, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి, పిసిజరవి, మలుగూరునాయక్ పాల్గొన్నారు.

రాహుల్‌ను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

కడప : అస్సాంలోని హైబోరాగావ్లోని శ్రీ శ్రీ శంకర్ దేవ్ సత్ర ఆలయాన్ని సందర్శించడానికి కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడ్లకుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి తప్పు పట్టారు. ఇందుకు వ్యతిరేకంగా సోమవారం సాయంత్రం కడప నగరంలోని రెండవ గాంధీ బొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, మధు రెడ్డి, మహమ్మద్ అలీ ఖాన్, కోటపాటి లక్ష్మయ్య, శామలమ్మ, చెప్పలి పుల్లయ్య, లావణ్య, సుబ్బారెడ్డి, హబీబుల్లా, అరుణ్ కుమార్,వెంకటసుబ్బమ్మ, సాతర్ల వెంకటసుబ్బమ్మ, చంద్ర, మామిల్ల నరసింహులు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రెండవ గాంధీ బొమ్మ నుంచి కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనలో వేలాదిమంది జనాభాను చూసి వైసిపి నాయకులకు దిమ్మ తిరిగిందని చెప్పారు. వారి అవినీతిని ఎండ గడుతూ బాబు ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసిందని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగి సామాన్య మద్దతు ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో అని ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని పేర్కొన్నారు. టిడిపి హామీలను జగన్ కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, జయరామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఇమ్రాన్, రవి, శంకర్ మామిళ్ళ శివ, రామలక్ష్మ మ్మ, చిప్పగిరి మీనాక్షి, స్వర్ణలత, అరుణ, మాధవి, అమరావతి, మల్లేశ్వరి నిర్మల,కార్యకర్తలు పాల్గొన్నారు.

మడక చక్రధర్‌కు సన్మానం

కడప : టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన మడక చక్రధం ను సోమవారం కడపలోని స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లాలోని పగటి వీర నాయకులు, బిసి నాయకులు శాలువాతో సన్మానించి, పూల బొకే అందజేసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మడక చక్రధర్ మాట్లాడుతూ బిసిలు, తొగట వీర క్షత్రియ కులబాంధవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా ప్రధనకార్యదర్శి భరత్ కుమార్, నగర అధ్యక్షుడు మల్లి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జోన్5 మీడియా కో- ఆర్డినేటర్ జనార్ధన్, 4వ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేష్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు జింక శ్రీను, పుట్టుబోయిన శ్రీనివాసులు, 45వ డివిజన్ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

17 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-కలికిరి

నాటుసారా విక్రేత అరెస్టును చూపిస్తున్న పోలీసులు

నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగిరిపల్లి క్రాసు వద్ద కాపురముండు కోలా నాగులు అనే వ్యక్తి కలికిరి - పీలేరు రోడ్డులో తోపు కాడ దళితవాడ సమీపంలో నాటుసారా విక్రయిస్తుండా వాయల్పాడు సిఐ సురేష్ కుమార్ ఆదేశాలపై కలికిరి పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ మధుసూదనాచారి, తన సిబ్బంది హెడ్-కాని స్టేబుళ్లు రాజేంద్ర, మదనమోహన రెడ్డి, కానిస్టే బుల్ జిలానీతో కలిసి దాడి చేసి కోలా నాగులును అరెస్టు చేసిసి అతని వద్ద వుండిన 17 లీటర్ల నాటుసారాయిని స్వాదీనం చేసుకొని, కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.